సాక్షి నిర్మల్

శనివారం | 27 | మే | 2023



పల్లె క్రీడా కెరటాలు

సీఎం కప్ క్రీడలతో ప్రతిభ ఉన్న గ్రామీణ క్రీడాకారులు వెలుగులోకి వచ్చారు. మండల, జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. స్టేట్ లెవల్‌లో సత్తా చాటుతామంటున్నారు.

10లో▸

ఖానాపూర్ నుంచి కరీంనగర్‌కు బస్ సర్వీస్

ఖానాపూర్: ఖానాపూర్–కడెం–జగిత్యాల మీదుగా కరీంనగర్‌కు నూతన బస్‌సర్వీస్‌ను ప్రారంభించామని మెట్‌పల్లి డిపో మేనేజర్ వేదవతి తెలిపారు. మెట్‌పల్లి నుంచి ఖానాపూర్– కడెం– కలమడుగు– జీర్‌పూర్– రేచపల్లి– సారంగాపూర్ – జగిత్యాల మీదుగా కరీంనగర్ వెళ్తుందని పేర్కొన్నారు. ఈ బస్సు మెట్‌పల్లి నుంచి ప్రతీరోజు ఉదయం 6.40 నిమిషాలకు బయలుదేరి కరీంనగర్‌కు 12.05 నిమిషాలకు చేరుతుందన్నారు. కరీంనగర్ ఈడీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు నూతన సర్వీసును ప్రారంభించామని పేర్కొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.7 /28.8

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశంలో అక్కడక్కడా మబ్బులు ఉంటాయి. ఎండ తీవ్రత కాస్త తగ్గుతుంది. ఉక్కబోత కొనసాగుతుంది. సాయంత్రం ఒకటి రెండు చోట్ల చినుకులు పడే అవకాశం ఉంది.

ముహూర్తం ఫిక్స్



సమీకృత కలెక్టరేట్

- జూన్ 4న జిల్లాకు సీఎం కేసీఆర్
- దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా.. సమీకృత కలెక్టరేట్ ప్రారంభం
- లబ్ధిదారులకు 'డబుల్' ఇళ్ల పంపిణీ

నిర్మల్: సీఎం కేసీఆర్ జిల్లా పర్యటనకు ఎట్టకేలకు ముహూర్తం ఖరారైంది. జూన్ 4న ముఖ్యమంత్రి రానున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కొత్త జిల్లాల కలెక్టరేట్‌లను ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో నిర్మల్‌లో సమీకృత కలెక్టరేట్‌ను వచ్చేనెల 4న ప్రారంభించనున్నారు. అలాగే లబ్ధిదారులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు, మెడికల్ కాలేజీ, బీఆర్ఎస్ భవన్ ప్రారంభోత్సవం తదితర కార్యక్రమాల్లో సీఎం పాల్గొనే అవకాశాలు ఉన్నట్లు చెబుతున్నారు.

రెండు నెలలుగా ఎదురు చూపు..

త్వరలోనే జిల్లాకు ముఖ్యమంత్రి వస్తారు, కలెక్టరేట్ ప్రారంభిస్తారు.. అని రెండు నెలలుగా అధికారపార్టీ ప్రజాప్రతినిధులు చెబుతూ వస్తున్నారు. ఎట్టకేలకు శుక్రవారం పక్కా తేదీని ప్రకటించారు. జూన్ 4న జిల్లాకు రానున్నట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. జిల్లా కేంద్రంలోని ఎల్లపెల్లి శివారులో 15 ఎకరాల్లో రూ.52 కోట్లతో సమీకృత కలెక్టరేట్‌ను నిర్మించారు. ఎప్పుడో ప్రారంభం కావాల్సిన భవనం పలు కారణాలతో నిర్మాణం ఆలస్యమైంది. ప్రారంభోత్సవమూ పలుమార్లు వాయిదా పడతూ వచ్చింది. ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో ఈసారి కచ్చితంగా ముఖ్యమంత్రి జిల్లాకు వస్తారని అధికార పార్టీ నాయకులు కూడా పేర్కొంటున్నారు.

'దశాబ్ది' ఉత్సవాల్లో భాగంగా..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించేలా ప్రభుత్వం ప్లాన్ చేసింది. 20 రోజులు కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఈ ఉత్సవాల్లోనే సమీకృత కలెక్టరేట్‌ను ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి రానున్నారు. కలెక్టరేట్ ప్రారంభంతోపాటు, ఉత్సవాల్లోనూ సీఎం పాల్గొన్నట్లు అవుతుందన్న ఉద్దేశంతో వచ్చేనెల మొదటివారంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఏప్రిల్‌లోనే సీఎం వస్తారంటూ వచ్చిన ఆదేశాల మేరకు కలెక్టరేట్ పనులను శరవేగంగా పూర్తిచేశారు. ఆ తర్వాత మేలో వస్తారని చెప్పినప్పటికీ తాజాగా జూన్ 4న ముహూర్తం ఫిక్స్ చేశారు.

ఎదురుచూపులు..

జిల్లాలో కలెక్టరేట్‌తోపాటు పలు అభివృద్ధి పనులు సైతం ముఖ్యమంత్రి రాకకోసం ఎదురుచూస్తున్నాయి. ప్రధానంగా ఎంపిక చేసిన లబ్ధిదారులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు అందించాల్సి ఉంది. నిర్మల్‌తోపాటు ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లోనూ కలిపి దాదాపు 2,400 మందిని ఎంపిక చేశారు. నిర్మల్ పట్టణంలోనే 1,460 ఇళ్లను లబ్ధిదారులకు అందించాల్సి ఉంది. మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవంతోపాటు బీఆర్ఎస్ భవన్‌నూ ప్రారంభించాల్సి ఉంది. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఆర్మూర్ నుంచి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ వరకు రైల్వేలైన్‌కు సంబంధించి సగంవాటా భరిస్తామన్న హామీలు అలాగే మిగిలిపోయాయి. ఈసారి వాటిపైనా సీఎం స్పందించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

ఏర్పాట్లు పూర్తి..

ముఖ్యమంత్రి ఎప్పుడైనా జిల్లాకు రావచ్చన్న సమాచారం ఉండటంతో ప్రారంభోత్సవాలకు ఏర్పాట్లు దాదాపు పూర్తిచేశారు. రెండు నెలల నుంచే కేసీఆర్ వస్తారన్న ఉద్దేశంతో ఇప్పటికే సమీకృత కలెక్టరేట్ పనులను పూర్తిచేసినట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు వెల్లడించారు. ఇక పోతే ఎన్‌హెచ్61 నుంచి బంగల్‌పేట్ వరకు చేపట్టిన రహదారి విస్తరణ పనులు ఇంకా పూర్తికాలేదు. త్వరలోనే ఈ పనులు పూర్తవుతాయని అధికారులు పేర్కొంటున్నారు.

ముస్సిపాలిటీల్లో ఆర్ఆర్ఆర్



నిర్మల్‌లో ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న వస్తువులు సేకరిస్తున్న మున్సిపల్ సిబ్బంది

- నిరుపయోగ వస్తువుల సేకరణకు ప్రత్యేక కార్యక్రమం
- ప్రతీ వార్డులో కేంద్రాల ఏర్పాటు
- జూన్ 5 వరకు వ్యర్థాల సేకరణ
- పురపాలక శాఖ వినూత్న కార్యక్రమం
- కేంద్ర, రాష్ట్రస్థాయిల్లో అవార్డులు సాధించేలా కసరత్తు

నిర్మల్‌చైన్‌గేట్: నగరాలు, పట్టణాల్లో స్వచ్ఛత కోసం కేంద్ర ప్రభుత్వం 'మేరా లైఫ్.. మేరా స్వచ్ఛ షెహర్' పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈనెల 20 నుంచి జూన్ 5వ తేదీ వరకు నిర్మల్ జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లోని వార్డుల్లో ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్)కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న సామగ్రిని ఆర్ఆర్ఆర్ కేంద్రాల్లో సేకరించనున్నారు.

వివరాల నమోదు..

ప్రభుత్వ ఆదేశాల మేరకు 'మేరా లైఫ్ మేరా స్వచ్ఛ షెహర్ పేరిట ఆర్ఆర్ఆర్ కేంద్రాల ద్వారా పాత సామగ్రిని సేకరిస్తున్నారు. పునర్వినియోగానికి ఉపయోగపడే వ్యర్థాలన్నింటినీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు. వార్డుల్లో నుంచి తెచ్చిన వస్తువులను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారు. ఎవరు ఇచ్చారు..? పేరు, ఇంటి నంబరు, మొబైల్ నంబర్, వస్తువుల పేర్లు రాయాలి. ఆ సామగ్రిని వార్డుల్లో ఎవరికైనా అవసరమైతే ఉచితంగానే ఇవ్వాలి.

సేకరించే వస్తువులు..

స్వయం సహాయక సంఘాల సభ్యులు 15 రోజులపాటు ప్రతీరోజు ఉదయం 7 నుంచి 10 గంటల వరకు ఆర్ఆర్ఆర్ కేంద్రాల నిర్వహణ బాధ్యతలు చూస్తారు. పర్యవేక్షణ కోసం వార్డు అధికారులను ప్రత్యేకంగా సేకరణకు నియమించారు. ఇళ్లల్లో నిరుపయోగంగా ఉన్న ప్లాస్టిక్, వంట సామగ్రి, వివిధ పుస్తకాలు, పేపర్లు, పాత దుస్తులు, పాదరక్షలు, ఇనుప సామగ్రి, పరుపులు, దిండ్లు, కుర్చీలు, బల్లలు, మంచాలు, పాలిథిన్ వ్యర్థాలను కేంద్రాల ద్వారా సేకరిస్తారు. ఏళ్ల నుంచి ఇళ్లలో పేరుకుపోయిన వ్యర్థాలను తగ్గించేందుకు పురపాలక శాఖ ఈ వినూత్న కార్యక్రమం అమలు చేస్తోంది. ఇచ్చిన వస్తువులకు ఈశీదు ఇస్తారు.

వార్డు కో కేంద్రం..

లక్ష జనాభా కంటే ఎక్కువ ఉన్న మున్సిపాలిటీల్లో వార్డుకు ఒకటి చొప్పున ఆర్ఆర్ఆర్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. నిర్మల్ మున్సిపాలిటీలో వార్డు ఒకటి చొప్పున తాత్కాలిక కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల్లో రెండు వార్డులకు కలిపి ఒక కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. ఆయా మున్సిపాలిటీల్లో తాత్కాలికంగా ఏర్పాటు చేసే కేంద్రాలను గుర్తిస్తున్నారు. వాటిని ఫొటోతీసి, జీయోట్యాగింగ్ చేసి స్వచ్ఛత పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

కేంద్రాల్లో సిబ్బంది ఇలా...

ఈ నెల 20 నుంచి జూన్ 5వ తేదీ వరకు ప్రజలకు అవగాహన కల్పించేలా ఈ కేంద్రాల్లో వార్డు అధికారి, కౌన్సిలర్, ఆర్పీ, మహిళా సంఘాల సభ్యులు, పారిశుధ్య సిబ్బంది, పది మంది వలంటీర్లు ఉంటారు. ఇళ్లలో నిరుపయోగ వస్తువులు, చెత్త చెందారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవచ్చు. ఇంటి వద్దకు వచ్చే మున్సిపల్ సిబ్బందికి చెత్తను ఇవ్వడం తగ్గుతుంది. ప్రజలకు అవగాహన కల్పించిన అనంతరం ప్రతీ మున్సిపాలిటీలో ఒకటి చొప్పున పర్మినెంట్ ఆర్ఆర్ఆర్ కేంద్రం ఏర్పాటు చేస్తారు.

ప్రస్తుతం ఏర్పాటు చేసిన కేంద్రాలు..

నిర్మల్‌లో.. మున్సిపాలిటీ కార్యాలయం, గాంధీచౌక్, గాంధీపార్కు
భైంసాలో... కుంట ఏరియా, ఓవైసీ నగర్, ఏపీనగర్, రాజీవ్‌నగర్, బట్టి గల్లీ 1, బట్టి గల్లీ 2, కిసాన్ గల్లీ, జైలా బుద్దిన్ గల్లీ, బంగాళా గల్లీ, నయాబాద్, సిద్దార్థ నగర్

జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో అవార్డులు..

ఆర్ఆర్ఆర్ కేంద్రాల ద్వారా అత్యధికంగా వస్తువులు సేకరించిన మున్సిపాలిటీలకు జాతీయ, రాష్ట్రస్థాయిల్లో అవార్డులు కేంద్రం అందిస్తుంది. అదేవిధంగా మున్సిపల్ స్థాయిలో ఏ కేంద్రంలో వస్తువులను ఎక్కువగా సేకరిస్తారో ఆ కేంద్రానికి కూడా అవార్డులు ఇస్తారు. అంతేకాక పర్యావరణ పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకుని ప్రతీ మున్సిపాలిటీలో ఓ చెరువులో వ్యర్థాలు, పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేయించనున్నారు.

ప్రజలు సహకరించాలి



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మున్సిపాలిటీల్లోని ఆర్ఆర్ఆర్ కేంద్రాల ద్వారా వ్యర్థాల సేకరణ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలి. అందరూ బాధ్యతగా భావించాలి. ఇళ్లు, పరిసరాల్లో వృథాగా, నిరుపయోగంగా ఉన్న వస్తువులను ఈ కేంద్రాల్లో అందించాలి. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ సహకరిస్తే కార్యక్రమం విజయవంతమవుతుంది. తద్వారా అవార్డులు కూడా లభిస్తాయి.

– సీవీఎస్.రాజు, మున్సిపల్ కమిషనర్, నిర్మల్

అవగాహన కల్పిస్తాం



భైంసా పట్టణంలో రెండు వార్డులకు ఒకటి చొప్పున ఆర్ఆర్ఆర్ కేంద్రాలు చేస్తున్నాం. వార్డు అధికారి, నోడల్ ఆఫీసర్ నియమించాం. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. ఇంట్లో పాడై, పనికిరాని వస్తువులను తీసుకు వచ్చి ఈ కేంద్రాల్లో అందించాలి. స్వచ్ఛ మున్సిపాలిటీకి సహకారం అందించాలని. ప్రజల భాగస్వామ్యంతోనే కార్యక్రమం సక్సెస్ అవుతుంది.

– వెంకటేశ్వర్లు, కమిషనర్ భైంసా మున్సిపాలిటీ

పాలిసెట్‌లో మెరిసిన విద్యార్థులు



తోడిశెట్టి రిషిత్



షేక్ అమన్



దూస హృతిక్



వర్షిత

లక్ష్మణచాంద/నిర్మల్ రూరల్: పాలిసెట్‌లో జిల్లా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. శుక్రవారం ప్రకటించిన ఫలితాల్లో లక్ష్మణచాంద మండలం బాబాపూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు షేక్ హుస్సేన్, మున్ని దంపతుల కుమారుడు షేక్ అమన్ 115 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 26వ ర్యాంక్ సాధించాడు. లక్ష్మణచాందకు చెందిన దూస హృతిక్ 112 మార్కులతో రాష్ట్రస్థాయిలో 96వ ర్యాంకు సాధించాడు. నిర్మల్ రూరల్ మండలం వెంగవాపేట్ గ్రామానికి చెందిన తోడిశెట్టి రిషిత్ రాష్ట్రస్థాయి 25వ ర్యాంకు సాధించాడు. తోడిశెట్టి అరుణ్‌కుమార్ విజయలక్ష్మి దంపతుల కుమారుడు రిషిత్ ఉత్తమ ర్యాంకు సాధించడంపై కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. లక్ష్మణచాంద మండలం నుంచి ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు రావడంపై ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. సోన్ మండలం కడ్తాల్‌కు చెందిన నర్సయ్య–అక్షయ కూతురు వర్షిత పాలిసెల్‌లో రాష్ట్రస్థాయిలో 941 ర్యాంకు సాధించింది. రాష్ట్రస్థాయి ర్యాంకు రావడంపై ప్రధానోపాధ్యాయుడు మహేందర్, ఉపాధ్యాయులు వర్షితను అభినందించారు.

న్యూస్‌రీల్

స్థానిక ఉత్పత్తులపై దృష్టి సారించాలి

- జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నరసింహారెడ్డి



మాట్లాడుతున్న నరసింహారెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: స్థానిక ఉత్పత్తులపై దృష్టి సారించాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నరసింహారెడ్డి అన్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్, తెలంగాణ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్, డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ సెంటర్, నిర్మల్, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ సహకారంతో శుక్రవారం ఎగుమతులపై అవగాహన, సామర్థ్యం పెంపుదల అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. నిర్మల్ నుంచి స్థానిక ఉత్పత్తుల ఎగుమతి వ్యాపారాన్ని పెంపొందించడానికి వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల ప్రయోజనం పొందేందుకు అవగాహన కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కొయ్య బొమ్మలు, పెయింటింగ్‌లు స్థానిక, అంతర్జాతీయ మార్కెట్లలో భారీ సామర్థ్యాన్ని కలిగి ఉంటాయని, ఈ ఉత్పత్తులపై దృష్టి సారించాలని సూచించారు. దిగుమతి ఎగుమతి కోడ్ కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రాముఖ్యతపై వివరణాత్మక ప్రజెంటేషన్ ఇచ్చారు.

30న జెడ్పీ సమావేశం

నిర్మల్ రూరల్: జిల్లా పరిషత్ సర్వసభ సమావేశం ఈనెల 30న నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో సుధీర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్‌లో ఉదయం 10 గంటలకు జెడ్పీ చైర్‌పర్సన్ కొరిపల్లి విజయలక్ష్మి అధ్యక్షతన సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు పూర్తి సమాచారంతో సకాలంలో హాజరు కావాలని సూచించారు.

నేడు బస్తీ దవాఖాన ప్రారంభం



ఆస్పత్రిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

ఖానాపూర్: పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను ఎమ్మెల్యే రేఖానాయక్ శనివారం ప్రారంభించనున్నారు. ఈమేరకు దవాఖానాను డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్ శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వం పీహెచ్‌సీ సబ్‌సెంటర్ తరహాలో సేవలందించేందుకు బస్తీ దవాఖానా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్, పీవో శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రాజేందర్, కమిషనర్ మనోహర్, కౌన్సిలర్ కావలి సంతోష్, హెచ్ఈవో రాజు, హెచ్ఈ జయలలిత తదితరులు ఉన్నారు.

నియోజకవర్గ సమస్యలపై అధికారులు, నేతలకు వినతి



బాజిరెడ్డి గోవర్ధన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ఖానాపూర్: టీఎస్ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డిని ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని కొత్త మండలాల్లో ఆర్టీసీ బస్టాండ్లు ఏర్పాటుతోపాటు పలు పాత బస్‌స్టేషన్ల మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. పెంబి మండలం మందపెల్లి గ్రామానికి చెందిన రాజేందర్ కొద్దిరోజుల క్రితం ఆర్టీసీ బస్సు ప్రమాదంలో మృతిచెందగా అతడికి రావాల్సిన రూ.10 లక్షల కంపోజిషన్ నిధులు మంజూరుచేయాలని కోరారు. అనంతరం పంచాయతీరాజ్ ఈఎన్‌సీని కలిసి కడెం మండలం గంగాపూర్‌తోపాటు పెంబి మండలం పసుపుల వంతెన పనులు ప్రారంభించాలని విన్నవించారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పుప్పాల శంకర్ ఉన్నారు.

'లక్ష్య'కు భైంసా ఏరియా ఆస్పత్రి

భైంసాటౌన్: జాతీయ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన లక్ష్య కార్యక్రమానికి భైంసా ఏరియా ఆస్పత్రి ఎంపికైనట్లు సూపరింటెండెంట్ కాశీనాథ్ తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజారోగ్య సదుపాయాలు, రోగులకు అందుతున్న సేవలపై కేంద్ర, రాష్ట్ర బృందాలు మార్చిలో భైంసా ఏరియాస్పత్రిని పలుమార్లు సందర్శించాయి. ఈ మేరకు లేబర్ రూం, మెటర్నిటీ ఓటీ విభాగాల్లో వసతులు, రికార్డులు పరిశీలించి క్వాలిటీ సర్టిఫికేషన్ చేసినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. లేబర్‌రూంకు 79 శాతం, మెటర్నిటీ ఓటీకి 77 శాతం స్కోర్ ఇస్తూ క్వాలిటీ సర్టిఫికేషన్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. లక్ష్య కార్యక్రమానికి భైంసా ఏరియా ఆస్పత్రి ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు.

లక్ష్యం ఘనం.. నిర్వహణ శూన్యం



తానూరు మండలం హిప్నెల్లి గ్రామంలో పగుళ్లు ఏర్పడిన నీటితొట్టి

- నీటితొట్టెలకు నీటి సౌకర్యం కరువు
- జిల్లాలో సగానికిపైగా నిరుపయోగమే
- నాసిరకంగా నిర్మాణంతో కొన్నింటికి లీకేజీలు

తానూరు: వేసవిలో మూగ జీవాలు దాహంతో అల్లాడకూడదన్న లక్ష్యంతో ఆరేళ్ల క్రితం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద జిల్లాలో లక్షల రూపాయలు వెచ్చించి నీటితొట్టెలు నిర్మించారు. ప్రస్తుతం వాటిలో సగానికిపైగా నిరుపయోగంగా ఉన్నాయి. నీటి తొట్టెల్లో చుక్కనీరు లేక మూగజీవాలు దాహంతో తల్లడిల్లుతున్నాయి. కొన్ని గ్రామాల్లో నీటి వసతి ఉన్న చోట నిర్మించగా సగానికి పైగా నీటి సౌకర్యం లేని ప్రదేశంలో నిర్మించారు. దీంతో పశువులు దాహం తీర్చుకునేందుకు చెరువులు, కుంటల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

నిర్వహణ లేక..

డ్వామా, ఉపాధిహామీ పథకంలో భాగంగా గతంలో ప్రతీ గ్రామ పంచాయతీలో మూడు, నాలుగు నీటి తొట్టెలు నిర్మించారు. 2010 నుంచి 2018 వరకు 953 తొట్టెలు నిర్మించారు. ఒక్కో నీటి తొట్టెకు రూ.22,190 చొప్పున రూ.74,41,488 ఖర్చు చేశారు. గ్రామాల్లో పశువులు సంచరించే ప్రాంతాల్లో బోరుబావుల సమీపంలో వీటిని నిర్మించారు. ప్రస్తుతం వీటిలో సగానికిపైగా పశువుల దాహార్తి తీర్చడం లేదు. బోరు మోటార్లు చెడిపోయి, పైప్‌లైన్ మరమ్మతులు లేక, విద్యుత్ సౌకర్యం లేక నీటి తొట్టెలు నిరుపయోగంగా మారాయి.

వివరాలు ...

జిల్లాలోని గ్రామాలు	682
పంచాయతీలు	396
నీటితొట్టెలు	953
నిర్మాణానికి చేసిన ఖర్చు	74,41,488
పనిదినాలు	17,362 రోజులు

ఉపయోగంలోకి తెస్తేనే మేలు...

చిన్నపాటి మరమ్మతులతో చాలా వరకు నీటితొట్టెలను వినియోగంలోకి తెచ్చే అవకాశం ఉంది. డ్వామా, పశుసంవర్ధక శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు ఈమేరకు చొరవ చూపితే బోరు మోటార్లు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. పగుళ్లకు మరమ్మతులు చేస్తే వినియోగంలోకి వస్తాయి. మిషన్ భగీరథ నీటి సరఫరా చేసినా చాలా వరకు వినియోగంలోకి వస్తాయి. ఈమేరకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వినియోగంలోకి తెస్తాం..

ఉపాధిహామీ పథకంలో భాగంగా నిర్మించిన నీటి తొట్టెల నిర్వహణ బాధ్యత పంచాయతీలదే. నిర్వహణ లేక చాలా గ్రామాల్లో అవి నిరుపయోగంగా మారాయి. నిరుపయోగంగా ఉన్నవాటి వివరాలు తెలుసుకుని వినియోగంలోకి తెస్తాం. పగుళ్లు బారిన తొట్టెలకు మరమ్మతు చేయిస్తాం. నీటి సౌకర్యం కల్పిస్తాం.

– ఓస ప్రసాద్, ఏపీడీ



రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేస్తున్న రైతులు

రోడ్డెక్కిన రైతన్న



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ చిన్నయ్య

కడెం: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు, అదనపు ధాన్యం తూకంపై కడెం మండలం లింగాపూర్ రైతులు రోడ్డెక్కారు. నచ్చన్‌ఎల్లాపూర్ బస్టాండ్ వద్ద నిర్మల్–మంచిర్యాల ప్రధాన రహదారిపై సుమారు గంటపాటు రాస్తారోకో చేశారు. కేంద్రంలో గన్నీ సంచుల లేవని, తూకం వేసిన ధాన్యం బస్తాల తరలింపునకు లారీలు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్య, ఎస్సై రాజు అక్కడికి చేరుకుని సమస్య పరిష్కరిస్తామని ఆందోళనను విరమింపజేశారు.

ఎమ్మెల్యే మిల్లుకు వద్దు

ఖానాపూర్ మండలంలోని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్‌కు చెందిన రైస్ మిల్లుకు వడ్లు పంపితే అడ్డగోలుగా ధాన్యం కోత విధిస్తున్నారని రైతుల ఆరోపించారు. తమ వడ్లు ఎమ్మెల్యే మిల్లుకు పంపొద్దని రైతులు డిమాండ్ చేశారు. రైతులకు కాంగ్రెస్ నాయకులు సతీశ్‌రెడ్డి, మల్లేశ్, వాజిద్ మద్దతు తెలిపారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ఈనెల 30 నుంచి మహాజన సంపర్క్ అభియాన్
- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీనివాస్



మాట్లాడుతున్న అల్జాపురం శ్రీనివాస్

నిర్మల్‌చైన్‌గేట్: వచ్చే ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి రావడమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పార్లమెంట్ ఇన్‌చార్జి అల్జాపూర్ శ్రీనివాస్ అన్నారు. నిర్మల్ జిల్లా కార్యవర్గ సమావేశం పార్టీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి అధ్యక్షతన శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 30 నుంచి జూన్ 30 వరకు నెల రోజులపాటు మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రధానిగా మోదీ సాధించిన విజయాలు, పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రపంచ దేశాలు నరేంద్రమోదీని ప్రపంచ నేతగా అభివర్ణిస్తుంటే, కేసీఆర్ తెలంగాణలో అవినీతికి రారాజుగా పేరొందారని ఆరోపించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలతోపాటు ఆ పార్టీ నాయకుల అవినీతిని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకుని అక్రమంగా సంపాదిస్తూ, ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.

డీ1 పంట్టాల పేరుతో భూకబ్జాలు..

మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో డీ1 పట్టాల పేరుతో బీఆర్ఎస్ నాయకులు భూములు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర మంజూరు చేస్తున్న నిధులను మళ్లించి తామే కేటాయించినట్లు చెప్పుకుంటున్నారని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో జిల్లా సహ ఇన్‌చార్జి మ్యన మహేశ్, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, ప్రధాన కార్యదర్శులు మెడిసెమ్మె రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, పడిపెల్లి గంగాధర్, డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, రామారావుపటేల్, మోహన్‌రావుపటేల్, జెడ్పీటీసీ జానుబాయి, నారాయణ్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ నాయుడు మురళి, జిల్లా ఉపాధ్యక్షులు కమల్ నయన్, గంగభూషణ్, కార్యదర్శులు మిట్టపల్లి రాజేందర్, కొరిపెల్లి శ్రావణ్‌రెడ్డి, దళితమోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, బీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు ఒడిసేల అర్జున్, సీనియర్ నాయకులు అంజుకుమార్‌రెడ్డి, ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

వివాహిత అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేఆర్కే కాలనీకి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. వివాహిత ఈ నెల 24న కూలీ పనులకు వెళ్తానని చెప్పి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అగ్ని ప్రమాదంలో పశుగ్రాసం దగ్ధం



మంటలు ఆర్పివేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కుంటాల: మండలంలోని ఓలా శివారులో శుక్రవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో కుంటాలకు చెందిన బోయిన్‌పెల్లి మోహన్‌రావు, దొనికెని బాపన్న అనే రైతుల పశుగ్రాసంతో పాటు విద్యుత్ పరికరాలు దగ్ధమయ్యాయి. బాపన్న వరిని నూర్పిడి చేసి కట్టకట్టేందుకు ఉంచిన రూ.5వేల విలువచేసే పశుగ్రాసం, రూ.10వేల విద్యుత్ పరికరాలు, మోహన్‌రావుకు చెందిన రూ.20వేల విలువ చేసే పశుగ్రాసంతో పాటు క్వింటాల్ మొక్కజొన్న బుట్టలు, రూ.10వేల విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. రైతులు భైంసా అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా సిబ్బంది మంటలు అదుపు చేశారు.

వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించాలి

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ పరిధి లోని రైతులకు సహజ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించి రైతుల అభ్యున్నతికి కృషి చేయాలని ప్రాజెక్టు ఉద్యాన అధికారి (పీహెచ్‌వో) గుడిమళ్ల సందీప్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం రైతుల భాగస్వామ్యంతో పనిచేస్తున్న వివిధ రకాల ఎన్‌జీవోల ప్రతినిధులతో సమావేశమై చర్చించారు. ఉద్యాన, వ్యవసాయ పంటల సాగులో సహజ వ్యవసాయ పద్ధతుల అవశ్యకతను తెలియజేశారు. దీంతో నేల ఆరోగ్యాన్ని పునరుద్ధరించడం, వైవిధ్యాన్ని కాపాడుకోవడం, స్థానిక సహజ వనరులను సమర్థవంతంగా ఉపయోగించడం, పర్యావరణ న్యాయాన్ని ప్రోత్సహించడం, నీరు, తేమ సంరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆయా ఎన్‌జీవోల ప్రతినిధులు విఠల్‌రావు, సత్యనారాయణ, నవీన్, కమలాకర్, మంగమ్మ పాల్గొన్నారు.

నేడు బాసరకు ప్రధాని మోదీ సోదరుడి రాక

భైంసాటౌన్: దేశ ప్రధాని నరేంద్రమోదీ సోదరుడు ప్రహ్లాద్ మోదీ శనివారం బాసరకు రానున్నారు. శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనం అనంతరం భారతీయ తైలిక్ సాహు రాథోడ్ మహాసభ న్యూఢిల్లీ వారి సౌజన్యంతో నిర్వహించనున్న గాండ్ల తేలికుల రాష్ట్రీయ పరిచయ వేదికలో పాల్గొననున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు యశ్వంత్‌కర్ శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పలు రాష్ట్రాల నుంచి కులసంఘాల నాయకులు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

పల్లె క్రీడా కెరటాలు

ప్రతిభ ఉండి గ్రామీణ ప్రాంతాలకే పరిమితమవుతున్న క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ పోటీలను ప్రారంభించింది. 18 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించగా ఈ నెల 15 ప్రారంభమైన మండల, జిల్లా స్థాయి క్రీడలు 24వ తేదీతో ముగిశాయి. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 28 నుంచి 31 వరకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. వారి అభిప్రాయాలు సాక్షితో ఈ విధంగా పంచుకున్నారు.

- సీఎం కప్ పోటీల్లో సత్తాచాటుతున్న గ్రామీణ యువత
- పలు విభాగాల్లో ప్రతిభ.. రాష్ట్రస్థాయికి ఎంపిక
- ఈ నెల 28 నుంచి 31వరకు రాష్ట్ర స్థాయి పోటీలు

రాష్ట్ర స్థాయిలో అవార్డు సాధిస్తా..



ఇంద్రవెల్లి: మా ఊరు ఇంద్రవెల్లి మండలంలోని మర్కగూడ గ్రామం. ప్రాథమిక స్థాయి నుంచే క్రీడలంటే చాలా ఇష్టం. అందులో ఖోఖో, రన్నింగ్, లాంగ్‌జంప్‌లో మంచి పట్టుంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో ఖోఖో విభాగంలో మండల, జిల్లా స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి అవార్డు అందుకున్నాను. రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యాను. హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో అవార్డు సాధిస్తాను.

– మాదవి ప్రశాంత్, ఖోఖో క్రీడాకారుడు

విజయం సాధిస్తాను..



నిర్మల్‌ఖిల్లా: సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో పదో తరగతి ఇటీవల పూర్తయింది. మా అమ్మానాన్నలు మానస–స్వామి. 100 మీటర్ల పరుగు పందెంలో జిల్లా స్థాయిలో రెండో స్థానం దక్కడంతో సంతోషంగా ఉంది. అమ్మానాన్నలు, మా పాఠశాల ఉపాధ్యాయులు ఎంతో ప్రోత్సహించారు. మరింత ఉత్సాహంతో రాష్ట్రస్థాయిలో గెలుపు కోసం నావంతుగా ప్రయత్నం చేస్తాను. విజయం సాధిస్తాననే నమ్మకం ఉంది. – **చిల్లా పల్లవి**

ఆనందంగా ఉంది..



బజార్‌హత్నూర్: సీఎం కప్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాను. మా డేద్ర గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదు. మొబైల్ నెట్‌వర్క్ రాదు. ఆదిలాబాద్ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, జూనియర్ కళాశాలలో చదువు పూర్తి చేశాను. ప్రస్తుతం ఆదిలాబాద్‌లోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ డిగ్రీ కళాశాలలో బీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. కబడ్డీలో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి సీఎం కప్‌కు ఎంపిక కావడం ఆనందంగా ఉంది.

– కుమ్ర హన్మంతు, కబడ్డీ క్రీడాకారుడు



గెలుపే లక్ష్యంగా ముందుకు..



నిర్మల్‌ఖిల్లా: నాది సోన్ మండలంలోని కడ్తాల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి పూర్తయింది. సునీత, జనార్దన్ మా అమ్మానాన్నల ప్రోత్సాహం మరవలేనిది. జిల్లా స్థాయిలో నిర్వహించిన లాంగ్‌జంప్ పోటీల్లో ప్రథమ స్థానం దక్కింది. సీఎం కప్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం ఆనందంగా ఉంది. మా ప్రధానోపాధ్యాయులు బి.మహేందర్, పీఈటీ వెన్నెల ప్రోత్సాహంతోనే మొదటి స్థానం దక్కింది. సీఎం కప్ రాష్ట్ర స్థాయిలో ఎంపిక కావడంతో మరింతగా ఉత్సాహం నెలకొంది. తప్పనిసరిగా రాష్ట్రస్థాయిలో అవార్డును సాధిస్తాను. ఇలాంటి క్రీడలతో చాలామందికి క్రీడలపై మక్కువ పెరుగుతుంది. ప్రోత్సాహిస్తే ఆటల్లో రాణించేవారు చాలామంది ఉన్నారు. – **పోలపల్లి నిఖిత**

ఖోఖోపై మక్కువతోనే...



నిర్మల్‌ఖిల్లా: నాది నిర్మల్ మండలంలోని వెంగ్వాపేట్ గ్రామం. అమ్మ లక్ష్మి, నాన్న గంగాధర్ వ్యవసాయ పనులు చేస్తుంటారు. నాకు చిన్నప్పటి నుంచే ఖోఖో అంటే ఇష్టం ఎనిమిదేళ్లుగా ఖోఖో సాధన చేస్తున్నాను. ఇటీవల సీఎం కప్ పోటీల్లో మండలస్థాయి నుంచి జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చడంతో నెల 28 నుంచి 31 వరకు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాను. పాఠశాల స్థాయి నుంచి తన ఫిజికల్ ట్రైనర్ భోజన్న, తన సీనియర్ రాకేష్‌ల ప్రోత్సాహం మరచిపోలేనిది. – **ఆడెపు రాకేష్, ఖోఖో క్రీడాకారుడు**

అమ్మానాన్నల ప్రోత్సాహంతోనే...



నిర్మల్‌ఖిల్లా: నా పేరు గాడి రవళిక. అమ్మా నాన్నలు గాడి లక్ష్మి, గోపాల్. సాధారణ దిగువ మధ్య తరగతికి చెందిన వ్యవసాయ ఆధారిత కుటుంబం మాది. నాకు చిన్నప్పటి నుంచే పాఠశాల స్థాయి నుంచి ఖోఖో అంటే ఇష్టం. ప్రస్తుతం రాష్ట్రస్థాయి టీంలో సభ్యురాలు కావడం సంతోషంగా ఉంది. దీంతో క్రీడాకారులుగా మాకు తగిన గుర్తింపు లభించినట్లుంది. గతంలో జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొన్నాను. ఈసారి సీఎం కప్‌లో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం ఆనందంగా అనిపిస్తుంది. తప్పనిసరిగా జట్టుతో కలిసి ఖోఖో పోటీలో విజయం సాధిస్తాం. క్రీడల్లో అమ్మానాన్నతో పాటు స్నేహితుల ప్రోత్సాహం మరవలేనిది.

– గాడి రవళిక, ఖోఖో క్రీడాకారిణి

రాష్ట్రస్థాయి పతకమే లక్ష్యం...



భరత్ సందీప్, లక్ష్మణచాంద

లక్ష్మణచాంద: నాది మండలంలోని వడ్యాల్ గ్రామం. చిన్నప్పటి నుంచే క్రీడలంటే ఇష్టం. సీఎం కప్ పోటీల్లో రాష్ట్రస్థాయి పతకం సాధించడమే లక్ష్యంగా ప్రాక్టీస్ చేస్తున్న. మండల స్థాయిలో షాట్‌పుట్‌లో మొదటి స్థానంలో, జిల్లా స్థాయి 10మీటర్లు పోటీలో విజేతగా నిలిచాను. దీంతో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి బహుమతి అందజేశారు. త్వరలో జరిగే రాష్ట్ర స్థాయిలో పతకం సాధిస్తాను.



మంత్రి అల్లోల ఐకేరెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న సందీప్

పరుగే నాకు ప్రాణం...



సారంగపూర్: నేను ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నాను. నాకు పరుగు అంటే ప్రాణం. చిన్నతనం నుంచి పరుగుపందెంలో పాల్గొని ప్రశంసలు పొందాను. పాఠశాల నుంచి దూరమయ్యాక నేను ఎక్కడ కూడా పరుగు పందెంలో పాల్గొనలేదు. నాకు సీఎం కప్ పోటీల్లో అవకాశం దొరికిందని ఎంతో సంబరపడ్డాను. అందుకే ఈ పోటీల్లో పాల్గొని జిల్లా స్థాయిలో గెలుపొందాను. రాష్ట్రస్థాయిలోనూ నా కంటూ ఓ ప్రత్యేకతను చాటుకుంటాననే నమ్మకం ఉంది.

– సేపాబాయి, దుర్గానగర్, సాయినగర్ తండా

నిప్పు పెడితే నష్టమే!



లోకేశ్వరంలో వరి కొయ్యలను కాలుస్తున్న రైతు

- వరి కొయ్య, గడ్డిని తగులబెట్టొద్దు
- మిత్ర పురుగులు, సూక్ష్మజీవులు చనిపోయే ప్రమాదం
- పొలం కలియదున్నితే భూసారం పెంపు

సాగుబడి

లోకేశ్వరం: వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. మరో 15రోజుల్లో ఖరీఫ్ పనులు మొదలవుతాయి. వరి కోత తర్వాత రైతులు కొయ్యలతో పాటు గడ్డిని కాల్చడం చేస్తుంటారు. దీంతో మిత్ర పురుగులు, సూక్ష్మజీవులు చనిపోతాయి. అలా కాకుండా రైతులు పొలంలో కలియదున్నడంతో భూసారం పెరుగుతుందని నిర్మల్ జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ చెబుతున్నారు. మరిన్ని వివరాలు ఆయన మాటల్లోనే..

గడ్డిని కాల్చితే కాలుష్యం ...

- వరి కొయ్యలను తగులబెడితే అనర్థాలే.
- నేలకు మేలు చేసే క్రిమికీటకాలు నశించి భూసారం తగ్గిపోతుంది.
- మట్టిని కాపాడుకోవాలంటే, కొయ్యకాళ్లను కాల్చకపోవడమే మంచిది.
- గడ్డిని కలియదున్నితే సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది.
- భూసారంతో పాటు దిగుబడులు పెరిగి రైతుకు మేలు జరుగుతుంది.
- వరికొయ్యలను కాల్చడంతో వాతావరణ కాలుష్యం పెరుగుతుంది.
- విపరీతమైన వేడితో భూమి సారాన్ని కోల్పోతుంది.
- భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి.
- పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి.
- మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయి. పొలాల్లో తిరిగే పాములు, ముంగీసలు, ఉడుములు, తొండలు ఇలా అనేక జీవరాశులు చనిపోయే ప్రమాదం ఉంది.
- దీంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది. గట్లు, మొరం గడ్డలపై ఉన్న పచ్చనిచెట్లు కూడా ఒక్కోసారి బుగ్గవుతున్నాయి.

ఒక్కసారి కాల్చితే 20ఏళ్లు వెనక్కి...

- కొయ్యకాళ్లను తగుల బెట్టడం వ్యవసాయానికి చేటు చేస్తుంది.
- వాతావరణంలో కాలుష్యం పెంచుతుంది.
- ఒకసారి కొయ్యకాళ్లను కాల్చితే వ్యవసాయం 20ఏళ్లు వెనుకబడినట్టే
- మట్టిలో కోటాను కోట్ల సూక్ష్మజీవులు ఉంటాయి.
- కొయ్యకాళ్లను తగుల బెట్టినప్పుడు ఇవన్నీ చనిపోతాయి. దీంతో భూసారం కోల్పోతుంది.
- రోటోవేటర్‌తో దున్నడంతో కొయ్యకాళ్లను చిన్నచిన్న ముక్కలుగా, పౌడర్‌గా మారుస్తుంది. తర్వాత రెండు బస్తాలు సూపర్ వేసి దున్నితే భూమి సారవంతంగా మారుతుంది.
- దీంతో ఎకరాకు పది ట్రాక్టర్ల మట్టి వేసినట్లు అవుతుంది. భూసారం పెరిగి పంట దిగుబడి పెరుగుతుంది.

కలియదున్నితే ఎన్నో ప్రయోజనాలు...

- వరి కొయ్యలు నేలలో కలియదున్నడంతో సేంద్రియ కర్బన శాతం పెరిగే అవకాశముంది.
- దుక్కి దున్నే సమయంలో సూపర్ ఫాస్పేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి.
- ఫలితంగా డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది.
- కలియ దున్నితే ఎకరాకు దాదాపుగా టన్ను ఎరువు తయారవుతుంది.
- మొక్కలకు 2శాతం నత్రజని (యూనియా) 4శాతం పాస్ఫరస్ అదనంగా అందిస్తుంది.
- జింక్, మాంగనీస్, ఇనుము, కాల్షియం లాంటి సూక్ష్మధాతువులు పంటకు మేలు చేకూర్చుతాయి.
- నేలలో కరగని మూలకాలను అనుకూలంగా మార్చుతుంది. నీటి నిల్వ పెరుగుతుంది.

చిన్నారిపై దాడిచేసిన వీధికుక్క



దాడిలో గాయపడిన చిన్నారి

కడెం: వీధి కుక్క చిన్నారిపై దాడిచేసి గాయపరిచిన సంఘటన మండలంలోని కొండుకూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పాత కొండుకూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వెల్పుల మహేశ్, శిరీష దంపతు ల నాలుగేళ్ల కూతురు నిశ్వితపై వీధికుక్క దాడి చే యగా తీవ్రంగా గాయమైంది. గురువారం సా య ంత్రం ఇంటి సమీపంలో ఆడుకునే సమయంలో కు క్క దాడిచేసింది. దీంతో నిర్మల్‌లోని ప్రభుత్వ ఆ సుపత్రికి తరలించి చికిత్స అందించారు. కుక్కల దా డులతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.

బాసరలో భక్తుల సందడి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

భైంసాటౌన్: బాసరలో శుక్రవారం భక్తుల సందడి నెలకొంది. శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముందుకు వేకువజామున గోదావరి నదిలో స్నానాలాచరించి పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తల్లిదండ్రులు చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు చేయించారు.

అపూర్వ సమ్మేళనం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాల పూర్వ చాత్రోపాధ్యాయుల అపూర్వ సమ్మేళనం అట్టహాసంగా సాగింది. 1997–98 బ్యాచ్‌కు చెందిన చాత్రోపాధ్యాయులు 25ఏళ్ల తర్వాత మళ్లీ ఒకచోట కలిశారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్ వేదికగా నిలిచింది. ఉపాధ్యాయ వృత్తి కోర్సును అభ్యసించి విద్యార్థులుగా విడిపోయిన వారు ప్రస్తుతం వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. చాలామంది ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తున్నారు. వివిధ జిల్లాలకు చెందిన వారు ఒక చోట కలిసి చదువుకున్నారు. తిరిగి వీరంతా ఒకచోట చేరడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పో యాయి. పరస్పరం యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సెల్ఫీలు తీసుకుని సందడి చేశారు. తమ కు విద్యాబుద్ధులు నేర్పి ప్ర యోజకులుగా తీర్చిదిద్దిన గురువులను ఆహ్వానించి సన్మానించారు. పూర్వ అధ్యాపకులు విశ్వనాథ్‌రావు, రాజయ్య, పోశెట్టి, ప్రకాష్, రవీందర్, విజయ రామారావు, పూర్వ ఛాత్రోపాధ్యాయులు లస్మన్న, నీలాదేవి, శశిధర్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రఫుల్, చందర్‌రెడ్డి, అరుణ, నారాయణ ఉన్నారు.



ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఎన్‌హెచ్‌ఎం, ఈసీఆర్‌పీ కేంద్ర తనిఖీ బృందం ప్రతినిధులు బాల సుబ్రహ్మణ్యం, ఎస్ఆర్ అనంత్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ప్రజల ఆరోగ్య పరిస్థితి, ప్రజలకు అందుతున్న వైద్య సేవలతో పాటు సిబ్బంది పనితీరుపై, నేషనల్ ప్రోగ్రామ్ ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలైన టీబీ నివారణ, మలేరియా, డెంగ్యూ, చిన్న పిల్లల ఇమ్యూనైజేషన్ కార్యక్రమాల అమలు తీరుపై ఆరా తీశారు. అనంతరం ఆస్పత్రి రికార్డులు పరిశీలించారు. టీహబ్ ద్వారా సేకరిస్తున్న రక్త నమూనాల సేకరణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని ప్రధాన్‌గూడ, ఈశ్వర్‌నగర్ గ్రామాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాలను పరిశీలించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలు అడిగి తెలుసుకున్నారు.



వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర బృందం ప్రతినిధులు

ఆరోగ్య ఉపకేంద్రాల్లోనే ప్రాథమిక వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. వైద్య సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం, ఈసీఆర్‌పీ కేంద్ర బృందం ప్రతినిధులు షాహిద్ అల్‌వర్షి, సంజీవ్ కుమార్ గుప్తా, హరిక్రిషన్, రాష్ట్ర ప్రోగ్రామ్ అధికారులు జె.శ్రీనివాస్, శ్రీకాంత్, వైద్యుడు శ్రీకాంత్ ఉన్నారు.

ఆస్పత్రుల తనిఖీ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఢిల్లీకి చెందిన ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీ బృందం శుక్రవారం తనిఖీ చేసింది. నేషనల్ హెల్త్ మిషన్ కింద జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కేటాయించిన నిధులతో నిర్మించిన భవనాలను పరిశీలించారు. ఎనిమిది మంది సభ్యులు జిల్లాకు రాగా ఇచ్చోడ, ఇంద్రవెల్లి, రిమ్స్ ఆస్పత్రులను ఒక బృందం, నార్నూర్‌లోని గుంజాల, గాదిగూడలోని పల్సువాడ(బి)లను పరిశీలించింది. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలను విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఉన్న సౌకర్యాలు పరిశీలించారు.